

'పది పైసలుంటే ఇవ్వు బ్లేడు తెప్పిస్తాను.'

వుల్లలు వుల్లలుగా ఇవతలకు పొడుచుకొచ్చిన గడ్డాన్ని దినదినానికీ పీక్కుపోతున్న ముఖాన్ని అద్దంలో చూసుకుంటూ ప్రక్కనే బియ్యం ఏరుతున్న భార్య నుద్దేశించి మెల్లగా అన్నాడు ప్రకాశం. ఈ విషయాన్ని వెళ్ళగక్కడానికి ఎంతో సేపటినుండి తటపటాయిస్తూ, మనస్సులో ఉత్పన్నమవుతున్న అనుమానాల్ని అంచనా వేస్తూ, గత్యంతరం లేక, సంశయపడుతూ అడిగాడు ఆమె సమాధానం కోసం ఆశగా ఎదురు చూస్తూ.

అతని మాటలు విని విననట్టు మౌనంగా వుండిపోయింది సరళ. మనస్సులో విసుక్కుంది. సంపాదనేమీ లేకపోయినా బ్లేడులకు, సిగరెట్లకు, ఇస్త్రీ గుడ్డలకు డబ్బులు అవసరం. ఇలా ఎంత కాలం అడుగుతాడో, ఎంతకాలం తను ఇవ్వాలో అర్థం కావడం లేదు. ఒక్క జీతంమీద నాలుగు జీవితాలు గడపటం కొంత ఇబ్బందిగానే వుంటుంది మరి. ఈ మాత్రం విచక్షణ వుండగలిగితే సంతోషించేదాన్నే. ఇలా తనకు తానే మనస్సులో తర్జనభర్జనలు చేసుకొనసాగింది. అక్కడినుండి లేచి బియ్యం స్టవ్ మీద కెక్కించింది.

ఆమెనుండి ఎలాంటి సమాధానం రాకపోయేసరికి నిట్టూర్పు విడుస్తూ ఆకారాన్ని మంచంమీదకు వాల్చాడు. చూపులు పెంటికప్పును పరిశీలిస్తున్నాయి. అక్కడక్కడా చిల్లులు పడి చెదలు పట్టిన వాసాలతో, తన జీవితం మల్లె వుంది కప్పు.

ప్రకాశం ప్రస్తుతం నిరుద్యోగి. ప్రభుత్వం వారి రిట్రెంచ్‌లో తను కూడా కొట్టుకొచ్చాడు. పెళ్ళయి నాలుగు సంవత్సరాలు కావస్తున్నాయి. పెరుగుతున్న ధరల్లాగే ఇద్దరు పిల్లలు కలిగి, పెరుగుతున్న పేదరికంలాగే వాళ్ళు దినదినానికి పెద్దవాళ్ళవుతున్నారు. భార్య సెకండరీ గ్రేడ్ టీచర్. ఇప్పుడు ఆవిడ సంపాదనతోనే సంసారం గడుస్తోంది. అందుకనే బ్లేడుకోసం భార్యను డబ్బులు అడగాల్సిన సందర్భం ప్రకాశం జీవితంలో సంభవించింది.

భార్య సంపాదిస్తుంటే తను తిని తిరగడం తన పురుషత్వానికి ఎంతో అవమానకరంగా వుంది. కాని, తను చేయగల్గిందేమీ లేకపోవడంతో విధి చూపుతున్న మార్గాన్నే అనుసరిస్తున్నాడు. అయినా తను చెయ్యవల్సిన ప్రయత్నాలన్నీ చేస్తూనే వున్నాడు. రేపోమాపోయని ఆశ చూపుతున్న ఉద్యోగం రూపు లేకుండా పోతోంది. తనకోసం మాత్రం అవసరమున్నన్ని డబ్బులు ఖర్చు చేయించుకుంటూనే వుంది.

తనమీదవున్న అక్కసునంతా పిల్లలమీద వెళ్ళగక్కుకుంటూ చిటపట లాడుతోంది సరళ. పిలవగానే రానందుకు రవిని చితక బాదుతోంది.

తన ఉద్యోగం వూడినప్పటినుండి సరళ ప్రవర్తనలో చాలా వింతమార్పులు ఏర్పడ్డాయి. దినదినానికీ ఆవిడలో పెరిగిపోతున్న అశాంతి నిస్పృహ ఆమెను పూర్తిగా మార్చివేస్తున్నాయి. భర్త అనే గౌరవం లేకుండా, తను భార్యననే విచక్షణ లేకుండా, ఆమెనుండి వచ్చే ప్రశ్నలు సమాధానాలు బహు విడ్డూరంగా వుంటున్నాయి. ఆవిడ మాటల్లో చెప్పలేనంత విసుగు, రుసరుసలు, ఒక్కమాటకు నాలుగు అర్థాలు స్ఫురించేలా వుంటున్నాయి. జీవితంలో దరిద్రమంతా తననే పీడిస్తున్నట్టు అనుక్షణమూ బాధపడుతోంది. కష్టాలన్నీ తననే ఆవరించినట్టు

వాపోతోంది. తనను చేసుకొని ఆమె ఏమీ సుఖపడలేదని, ఎదుటివాళ్ల సుఖాన్ని గ్రహించి తననుతాను నిందించుకుంటోంది.

'ఇదో నాన్న బ్లేడు.'

రవిమాటలు విని ఆలోచనలనుండి తేరుకొని మంచంమీద లేచి కూర్చున్నాడు ప్రకాశం. చేతిలోకి బ్లేడు తీసుకొని, ఎడమ చేత్తో గడ్డాన్ని నిమురుకుంటూ లేచి కిటికీవద్దకు నడిచాడు.

గబగబా వంట చేసేసి స్కూలుకు వెళ్ళడానికి ముస్తాబవుతోంది సరళ. రవి పుస్తకాలు చేతబట్టుకొని తల్లి రాకకొరకు ఎదురుచూస్తూ నిలబడ్డాడు.

వాళ్లకేసి చూస్తూ మౌనంగా వుండి పోయాడు ప్రకాశం.

కొద్దిసేపటికి అతనివేపు తిరిగి 'అన్నం పెట్టుకొని తినండి సాయంత్రం పనిమనిషి వస్తే వంటపాత్రలు తోమూలకు వేయండి. సాయంత్రం ఆలస్యంగా వస్తాను. మా హెడ్మిస్ట్రెస్‌గారి అబ్బాయి బారసాల వుంది. రెండుపావుల బియ్యంపోసి వండండి. కూర అదే సరిపుచ్చుకోవచ్చు.' చెప్పడం ఆపేసి రెండవ అబ్బాయిని ఎత్తుకొని బయటికి కదిలింది సరళ భోజనం చెయ్యకుండానే. ఆవిడ వెనుకాలే రవి కదిలాడు.

ఆవిడ వెళ్లినవేపే నిమిషాల తరబడి రెప్పవాల్చకుండా చూస్తూ బుర్రలో లేస్తున్న ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కోసాగాడు ప్రకాశం. ప్రతిరోజూ తనకొరకు కేటాయించే పనులే కాకుండా, వాటిల్లో ఈ రోజు మరికొన్ని కొత్తవి చేర్చి, అక్షరాల అమలుపెట్టాలన్న ధోరణిలో వున్నాయి ఆవిడ మాటలు.

జేబులోనుండి సగానికి కాల్చిన సిగరెట్ ఇవతలకు తీసి వెలిగించుకున్నాడు. పిచ్చిగా శూన్యంలోకి చూస్తూ పరిపరివిధాల ఆలోచించుకో సాగాడు.

* * *

సాయంత్రం ఆరుగంటల ప్రాంతాన దగ్గరగా వేసివున్న గదితలుపులను తెరుచుకొని లోపలికి ప్రవేశించింది సరళ. చిన్నబాబు నిద్రపోవడంతో మంచంలో వేసింది. రవి గుడ్డలు విప్పుకోవడంతోనే ఆకలి అంటూ అరిచాడు. ప్లేటు శుభ్రంగా కడిగి అన్నంగిన్నెమూత తెరిచింది. ప్రొద్దున తాను వండిన అన్నంలో మెతుకు తక్కువ కాకుండా అంచులవరకు నిండియుంది. 'ఆయన తినలేదన్నమాట' మనస్సులో అనుకుంది. రవికి వడ్డించి దృష్టిని అతని వేపు మళ్లించింది.

శరీరంనిండా దుప్పటి కప్పుకొని గోడకేసి తిరిగి పడుకున్నాడు ప్రకాశం. వుండి వుండి శరీరం ఎగిరిపడుతోంది.

నిద్రపోయాడనుకుంది. తనూ పళ్లెంలో నాలుగు మెతుకులు వడ్డించుకుంది. వ్రేళ్లతో మెతుకుల్ని కెలుకుతుందేకాని మెతుకుల్ని నోట్లోకి చేరవేయలేక పోతోంది. మస్తిష్కంలో ఆలోచనలు మూక ఉమ్మడిగా ప్రోగవుతున్నాయి...'ఆయనెందుకు అన్నం తినలేదు? హోటల్‌కు వెళ్లుంటాడా? అయినా డబ్బులేవి? బహుశా వంట చెయ్యమని చెప్పినందుకు బాధపడి వుంటాడు. తనొచ్చేసరికి ఆలస్యమవుతుందని చెయ్యమన్నాను. ఈమాత్రానికే అలకపాన్పు ఎక్కాలా?' ఆమెలో ఉద్భవించిన ప్రశ్నలన్నిటికీ సాధ్యమైనంత వరకు తన విషయాల్లో ఎలాంటి పొరపాట్లు లేవనే వుద్దేశంతో ఊహించుకుంటూ అతని ప్రవర్తనకు అబ్బురపడ సాగింది.

తను వడ్డించుకున్న మెతుకుల్ని సగానికి పైగా నీళ్లపాలుచేసి, అతనికి ఎదురుగా యున్న చాపమీద ఆసీనురాలయింది.

అబ్బ...ఏమిటీ బ్రతుకు? తిన్న అన్నం ఒంటికి పట్టకుండా. ఇలా ఒక్కరోజు మాత్రమే కాదు. వారానికి రెండుమూడు రోజులు జరగడం తప్పనిసరి అవుతోంది. తన నోటినుండి వెలువడిన మాటలన్నీ పెడర్థంగా, పుల్లవిరుపుగా భావించుకుంటాడు. తన విషయం ఆయనకు పట్టింపులేదు. ఆయన విషయం తనకు అవసరం. తను ఉద్యోగం చేస్తున్నా ఇద్దరు పిల్లల్ని, మొగుడ్ని పోషించడం ఎంత ఇబ్బందిగా వుంటుందో; ఏ స్త్రీకి ఇంతకన్నా ఎక్కువ సహనం వుంటుందో యోచించే పరిజ్ఞానం ఆయనలో మాత్రం ఎందుకుండకూడదూ ...? ఆడదాని సంపాదన మీదనా మొగవాడు బ్రతికేది? అయినా ఎంతకాలం?

ఏ స్త్రీలో లేని సహనం తనలో వుందని, ఆయనవల్ల ఏ మాత్రం సుఖం లేదని ఆమె మనస్సు వాపోతోంది. చెక్కిళ్ల మీదుగా నీళ్లు జలజల కారసాగాయి.

గదిలోకి ప్రవేశించిన సరళ ఉనికిని గ్రహించి కళ్లు చిన్నగా విప్పుతున్నాడు ప్రకాశం. కాని, కళ్లమీద నుండి దుప్పటి తొలగించలేదు. బుర్రలో మళ్లీ ఆలోచనలు ప్రారంభమయ్యాయి. 'సరళ పూర్తిగా మారిపోయింది. తను ఆఫీసు నుండి రాగానే, చక్కగా ముస్తాబై చిరునవ్వులు చిందుతూ ఎదురుబడి స్వాగతమిచ్చి, కాఫీ గ్లాసు అందించి, తనను ఉక్కిరి బిక్కిరి చేసిన క్షణాలు, అలాంటి సరళ మళ్లీ రాదు. ఇప్పుడీ సరళకీ ఆ సరళకీ మహా అఘాతం ఏర్పడింది. ఆ సరళను ఈ సరళతో పోల్చుకోకూడదు. అబ్బ...ఏమిటీ ఆడవాళ్లు ఎంతలో ఎంత మార్పు? అంటే ఆ రోజుల్లో తనను గాఢంగా ప్రేమించడానికి గల కారణాలు ఇవమిద్దమని చెప్పలేక పోయినా, నాలుగు డబ్బులు చేతికివ్వడంతోనే మురిసిపోతూ తనను ప్రేమించేది. అయితే డబ్బులుంటేనే భర్తను భార్య ప్రేమిస్తుందా? ఇలాంటి మనస్తత్వం వేశ్యలో వున్నా ఒకొక్కప్పుడు మగాడిని చూసి జాలిపడుతుంది. మరి, భార్య కూడా ఒకొక్కప్పుడు ఇలా మారిపోవడం, అనురాగం, ఆప్యాయతలను ఉపసంహరించుకోవడం ఏ మొగాడికైనా వింతగానే వుంటుంది.

అదీ గాకుండా తను రామరావు కిచెన్ రూమ్ చార్జ్ ఇచ్చేసింది. ఈ రోజు వంట చెయ్యడమనే నూతన కార్యక్రమాన్ని రూపొందించింది. ఆవకాశం ఇంకా ఏవో నూతన పథకాలు అల్లుతోంది. ఈ పనులన్నీ ఖచ్చితంగా తనతో చేయించుకోవాలన్న వుద్దేశం ఆమెలో వుంటే తను చేసి తీరాలా? ఉహూ...ఏదైనా తనివని చెయ్యలేను. ఆమెలో ఇదొక రకమైన అహంకారం, ఏదో వెలగబెడుతున్న హొందా, తనలాంటి స్త్రీ ప్రపంచములో మరొకరుండనే సద్భావం ఆమెలో బాగా జీర్ణించుకపోయింది. ఆవిడ ఎంత ప్రయోజకురాలైనా తానొక ప్రయోజకుడనని పెత్తనం చెలాయించుకోవడం ఆడదానికి ఎంతవరకు సబబు? ఆవిడ మాటల్లో ఎన్నో గూఢార్థాలు, సాధింపులు, తనకేదో

# దీపం

[illegible] జరుగుతుందని [illegible]నమూ ఆయిన వాళ్లమీద కాని వాళ్ల మీద విరుచుక పడటం విజ్ఞుల లక్షణమా?

కొద్దిసేపటికి ముఖం మీద నుండి దుప్పటి తొలగించుకొని లేచి కూర్చున్నాడు ప్రకాశం రెండు చేతులతో ముఖాన్ని నిమురుకుంటూ.

అంతసేపటి వరకు అతని వేపే కేంద్రీకృతమైన ఆవిడ చూపులు గిరుక్కున వెనుకకు తిరిగి వీధి బయట పడ్డాయి. ఇరువురి నోటంట మాటలు పెగల్లేదు.

దీపం ఎదురుగా కూర్చున్న తను, ఆకారాన్ని కొద్దిగా ముందుకు వంచి పలక మీద వ్రాసుకోసాగాడు.


తను ప్రస్తావించ దలుచుకున్న విషయం మనసులో డంగురాయిలా తిరుగుతున్నా ఇది తన జీవితంలో చివరి యాచనగా తలంచి అడగాలని స్థిరంగా నిశ్చయించుకున్నాడు సమయాన్ని సందర్భాన్ని ఊహించుకుంటూ — ప్రకాశం.

చాలా సేపటిదాకా నిరీక్షించాడు ఆవిడ పలకరిస్తుందేమోనని. కాని, తను ఊహించుకున్నట్లు జరగకుండా భిన్నంగా జరిగింది. ముందు కూర్చున్న భంగిమలో కాకుండా ఆకారాన్ని చాపమీద వాల్చి గోడ కేసి తిరిగింది. అతని ప్రవర్తనకు నిరసన సూచకంగా. అయినా ఇది ముఖ్యమైన విషయం కాబట్టి మరీ, ముఖ్యంగా తన జీవిత సమస్య కాబట్టి తనే ముందుగా నోరు విప్పుకున్నాడు.

'ఇవ్వాళ ఇంటర్వ్యూకు వెళ్లాను. తప్పకుండా సెలెక్ట్ అవుతానన్న విశ్వాసం వుంది. అయినా, మినిస్టర్‌తో ఒక ఫోన్ చేయిస్తే వచ్చే ఉద్యోగానికి చేసిన మర్యాద తగినట్టుగా వుంటుంది. అందుకని ఒక్కసారి హైద్రాబాదు వెళ్లొస్తే...'

మిగతా వాక్యాలు అతని గొంతుకలోనే మిగిలిపోయాయి. ఆవిడ మనస్తత్వాన్ని; తను చెప్పిన విషయాలపై తర్జనభర్జన చేసుకుంటూ, దృష్టినంతా ఆవిడ వైపు ప్రోగుచేసి ఆసక్తిగా చూస్తూ కూర్చున్నాడు.

అతని మాటలు ఆవిడ చెవుల్లో గింగురుమంటున్నాయి. ఒక్కొక్కటే విడి విడిగా ఆలోచించి నిట్టూర్పు విడిచింది. ఇట్లాంటివి వినడం తనకు మామూలే. ఇలా ఎన్నోసార్లు హైద్రాబాదు వెళ్లొచ్చినా నగరాన్ని చూసి రావడమే కాని, అసలు కార్యం ఒడ్డుకెక్కిన పాపాన పోలేదు.




[illegible] ఏముంది?

ఆమెనుండి ఎలాంటి సమాధానం రాక పోయేసరికి అయన ప్రతిపాదించిన బిల్లును ఆమె ఆమోదించలేదని స్పష్టంగా విదితమయింది. ఇక ఇప్పుడు తను చేసేదల్లా వ్రేళ్లు పిసుక్కుంటూ కూర్చోవడమే.

ఇది మంచి అవకాశం. ఈ అవకాశం జారవిడిస్తే ఇట్లాంటిది మరొకటి రావడం కలలో ఊహించని విషయం. దీని విషయం సూక్ష్మంగా గ్రహించకుండా ఆవిడ విముఖత చూపడం కొంత ఇబ్బందిగానే వున్నా, ప్రస్తుత పరిస్థితిని గుర్తుకు తెచ్చుకొని వేరే మార్గాలను వెతకసాగాడు. బుర్రలో పర్యటిస్తున్న ఆలోచనలన్నీ విసిగి వేసారి కొన్ని నిమిషాలనంతరం తిరుగుముఖం పట్టాయి. ఈ విషయాన్ని ఏ రకంగానైనా తేల్చుకోలేక అప్రయోజకుడుగానే మిగిలిపోయాడు ప్రకాశం.

సరళ లేచి కూర్చుంది ఏదో నిర్ణయాని కొచ్చినదానిలా.

ఆమెవేపు ఆశగా కళ్లు విప్పుకొని చూశాడు ప్రకాశం. పరస్పరం ఒకర్నొకరు చూసుకొని మౌనంగానే వుండిపోయారు.

'ఈ ఒక్కసారి ఎలాగో సర్దుబాటు చెయ్యి సరళ. పదిరూపాయల్లో వెళ్లొస్తాను. ఈ ఉద్యోగం తప్పకుండా దొరుకుతుందన్న విశ్వాసం నాకుంది. కాదనకు...'

అతని కంఠంలో మాటలు తడబడ్డాయి. మాటల్లో అర్థింపు, మెత్తదనం తప్ప వేరే ఇతరత్రా ఊహించుకోవడానికి ఆస్కారమే లేదు. అతని ముఖంలో ఉట్టిపడుతున్న దీనత్వం, ఆప్యాయత ఆమె మనస్సును మార్చివేయడానికి ఏ మాత్రమూ సహకరించలేకపోయాయి.

ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు? నా దగ్గర నయాపైస లేదు. ఈ నెలాఖరులో ఎవర్నడగాలి? అడగడానికైనా సిగ్గుండాలి' ఆమె నోటినుండి చాలా కటువుగా వెలువడ్డాయి మాటలు. ఆమెలో రాజుకుంటున్న అక్కసునంతా చాలా కొద్ది వాక్యాల్లో ఇవతల గుమ్మరించింది.

ఆవిడ మాటలు విని నిశ్చేష్టుడై పోయాడు ప్రకాశం. నోటంట మాటలు [illegible] వాక్యాలు పడుతున్న దీపంలోని

[illegible]

# దీపం

చాలాసేపటి తర్వాత ఆమె లేచి పక్కింట్లోకి వెళ్ళి వచ్చింది. పది రూపాయల నోటును అతని ముందు వుంచి, మారు మాట్లాడకుండా వెళ్ళి చాప మీద పడుకుంది ఆకారాన్ని గోడకేసి తిప్పి.

ఎదురుగా అగుపడుతున్న పదిరూపాయల నోటుకేసి క్షణంపాటు రెప్ప వాల్చకుండా చూస్తూ వుండిపోయాడు ప్రకాశం. బుర్రలో ఉత్పన్నమవుతున్న ప్రశ్నలకు, సమాధానాలతో సరిపుచ్చుకొని ప్రయాణానికి సంసిద్ధుడయ్యాడు. మంచం దిగి గబగబా గుడ్డలు మార్చుకొని అవసరమున్న కాగితాలన్నీ భద్రంగా జేబులో దాచుకున్నాడు.

'రెండు రోజుల్లో తిరిగివస్తాను సరళ. రాత్రిపూట జాగ్రత్తగా మసలుకో ఈమధ్య దొంగలబెడద ఎక్కువవుతోంది' భార్యనుద్దేశించి తాను చెప్పదలుచుకున్నది చెప్పడం ఆపేసి, దృష్టిని పిల్లలవేపు మరల్చుకున్నాడు. పిల్లలిద్దరూ తల్లిని వాటేసుకొని హాయిగా నిద్రపోతున్నారు. ఇక తను చేసేదేమి లేదన్న నిర్ణయానికొచ్చి అడుగులను బయటికి కదిలించాడు.

* * *

వెలుగుతున్న దీపంకేసి చూస్తూ కూర్చుంది సరళ. చెక్కిళ్ళ మీదుగా ఏకధాటిగా కారుతున్నాయి నీళ్ళు. జీవితంలో అందరిలాగా తనకు సుఖం లభించడం లేదని, తాను ఎంతో దురదృష్టవంతురాలనని ఆమె వాపోతోంది. బ్రతుకంతా ఒడుదుడుకులతో, ఏదో వెలితి, నిరాశ, నిస్పృహలు తనను ఆవరించినట్లు తలచుకొని దుఃఖాన్ని కన్నీళ్ళ రూపకంగా తీర్చుకుంటోంది.

కళ్ళముందు తనలాంటి స్త్రీ జీవితాల బ్రతుకులు మెదిలాయి.


ఎదురింటి జానకి తనలాగే ఉద్యోగం చేస్తోంది. భర్త తహసీలు ఆఫీసులో ఉద్యోగం? రెండు జీతాలతో వున్నది ఇద్దరుపిల్లలే అయినా వాళ్ళకు వచ్చే డబ్బులు సరిపోవడములేదు. జీతాలొచ్చి వారం తిరగకముందే అప్పుకోసం చుట్టుప్రక్కల ఇళ్ళమీద పడతారు. అవసరానికి తాకట్టు పెట్టుకోవడానికి వీసమెత్తు బంగారము లేదు. ఒంటిమీద చీరలైనా చెప్పుకోదగ్గ ఖరీదు చేసేవి కావు, అనుమానమూ భార్యాభర్తలకు పేచీలు.

పక్కింటి శారద కూడా ఉద్యోగం చేస్తోంది, భర్త పెద్ద హోదాలోనే వున్నాడు. ఆవిడకు ఒంటినిండా సొమ్ములు. ఇంటినిండా ఖరీదైన వస్తువులు. అడుగడుగునా నౌకర్ల సపర్యలు నలుగురు సంతానం. అయినా తను ఎంతో దురదృష్టవంతురాలని ప్రొద్దస్తమానమూ కంట తడిపెడుతుంది భర్త త్రాగుబోతు! త్రాగినప్పుడల్లా ఆవిడను చితకబాదటం తద్యం.

చుట్టుప్రక్కలవాళ్ళ ... వీళ్ళల్లో తను ఎంతవరకు దురదృష్టవంతురాలో, ఎంతవరకు అదృష్టవంతురాలో తేల్చుకోవాలిప్పుడు. వీళ్ళందరిలా తనకు సొమ్ములు, మేడలు, కార్లు లేకపోయినా తనకు జీవితంలో సంతృప్తి వుంది. కాని, వీళ్ళను చూస్తూ వుంటే ఏదో కారణమైన అసంతృప్తి మనస్సులో రంపపుకోత పెడుతోంది. వీళ్ళ భర్తల్లాగ తనభర్త త్రాగుబోతుకాదు. తనను పెళ్ళయినప్పటినుండి ఒక్కమాట అని ఎరగడు. ఇంతవరకు తను ప్రతిపాదించడం వారు బలపరచడం జరుగుతోంది. వీళ్ళందరిలో తనభర్త చాలా అమాయకుడు. తనను గాఢంగా ప్రేమించాడు. దురదృష్టవశాత్తు మధ్యలో ఉద్యోగం వూడిపోవటంవల్ల వారిపై వున్న అసహ్యమే కాని, బ్రతుకుమీద అసంతృప్తిని ఏదో చెప్పడానికి వీల్లేకపోయినా తను అమితంగా ప్రేమించలేక పోయింది. కారణం? అంతా తనలోవున్న అజ్ఞానమే. తనకు లేనివి కావాలని, కావాలన్నవి అనుభవించాలన్న తాపత్రయమే మనస్సును పెడత్రోవన మళ్ళించి వారి మంచితనానికి దూరంగా చేసింది.

తను ఇంతవరకు ఎంతో దురదృష్టవంతురాలు. తనను అమితంగా ప్రేమించే భర్త, రత్నాల్లాంటి ఇద్దరు కొడుకులున్నారు. తనకింకా వున్న లోటేమిటి? వారికి ఉద్యోగం లేకనేనా...? వారికి ఉద్యోగం దొరకదా? ఎందుకు దొరకదూ... తప్పకుండా దొరుకుతుంది. అప్పుడు తన కోరికలన్నీ చిగురిస్తాయి. అప్పుడు తను ఎంతో అదృష్టవంతురాలు. అప్పుడే కాదు ఇప్పుడుకూడా తను ఎంతో అదృష్టవంతురాలు. కాని, అబ్బా...వారిప్పుడు ఎదురుగా వుంటె ఎంత బాగుండేది. తన తప్పుల్ని క్షమించమని కన్నీళ్ళతో వేడుకునేది. వారు నవ్వేవారు. తన అదృష్టాన్ని వారి బాహు బంధాల్లో అనుభవించేది.

వారిపట్ల తను ఎంతో మూర్ఖంగా ప్రవర్తించింది. వెళ్ళేప్పుడు అన్నం తిన్నామని కూడా అడగలేదు. పైగా ఇంటిపని కూడా చేయించుకున్నాను. అయినా వారు అదేమీ చెప్పలేదు. ఛీ...తనలో ఎంత పశుత్వం వుంది. ఇంతకాలంగా ఈ మూర్ఖ



త్యాన్ని, అజ్ఞానాన్ని ఎలా భరించగలిగింది. నిజంగా వారు నన్ను క్షమిస్తారా?

పశ్చాత్తాపంతో ఆవిడకళ్లు వర్షిస్తున్నాయి. మనస్సంతా వికలమయింది.

సంసారం దీపం లాంటిది. అందులో స్త్రీ వెలుగుతున్న శిఖలాంటిది. భర్త, ఈదురుగాలినుండి రక్షిస్తూ తన బాహుబంధాల్లో ఇరికించుకున్న బుగ్గలాంటివాడు. ఎటొచ్చీ బుద్ధిలో పోస్తున్న నూనెవద్ద పేచీలు ఏర్పడితే సంసారం ముందుకు కొనసాగదంటె ఆశ్చర్యపడటమెందుకు?

* * *

టేబులుమీద దీపం గాలికి రెప రెప లాడుతోంది.

మంచంమీద అటునిటు పొర్లుతున్నాడు ప్రకాశం. ఆయాసంతో రొప్పుతూ మూలుగుతున్నాడు. శరీరం నిప్పులా కాలుతోంది.

మంచం పట్టెమీద కూర్చున్న సరళ అతనివేపు జాలిగా చూస్తూ కళ్లనిండా నీరు నిలుపుకుంది. ఏమి చెయ్యాలో అర్థంకాక పిచ్చిగా అతనివేపే చూస్తూ కూర్చుంది.

ఆయన జబ్బు చేసిందని ఉత్తరాలు వ్రాస్తే తనవైపునుండి, ఆయన వైపునుండి గాని ఎవ్వరూ రాలేదు. అంటె ఈ ప్రపంచములో ఎవరికి ఎవరూ ఏమీ కారని అనుభవం బాగా బుద్ధి చెప్పింది.

'ఏమండీ...పాలు కొద్దిగా తీసుకోండి' దీనంగా చూస్తూ అర్థించింది సరళ. అతనినుండి ఎలాంటి సమాధానం రాలేదు. కళ్లు మూసుకొని నిద్ర పోసాగాడు.

'ఏమండీ...'

'..................'

రెండవసారికూడా అతను పలకక పోవడంతో కొయ్యలో కుదుపుతూ మళ్లీ పిలిచింది. అతనినుండి సమాధానం శూన్యం శాశ్వతంగా కళ్లు మూసుకొని నిద్రపోసాగాడు ఆయన ఈ ప్రపంచం నుండి నిష్క్రమించాడన్న సంగతి గ్రహించినతోడనే ఆవిడ కెవ్వున అరిచింది.

మంచంపైన నిద్రపోతున్న సరళ ఉలిక్కిపడి లేచికూర్చుంది. భయంతో కంపించిపోతూ చుట్టూ కలియజూసింది. పిల్లలిద్దరూ ప్రశాంతంగా నిద్ర పోతున్నారు. కాని, ప్రకాశం అగుపించలేదు. చాలా సేపటివరకు గ్రహించలేక పోయింది. తన నింతవరకూ పీడకల పట్టుకుందని భయం భయంగా చూస్తూ మళ్లీ మంచంమీద వాలింది చిన్నబాబును గుండెలకు హత్తుకుంటూ.

ఎక్కడో కోడి కూసిన శబ్దం.

బయట తలుపు కొట్టిన శబ్దం.

మంచం మీద వాలిపోయిన సరళ తృళ్లిపడి లేచి కూర్చుంది భయంగా దిక్కులుచూస్తూ.

బయట మళ్లీ అదే శబ్దం...పొడిగా దగ్గు.

'ఎవరూ...?' ఆమె పెదవులు అప్రయత్నంగా విడివడ్డాయి.

'నేనే...సరళా...'

ప్రకాశం కంఠం గుర్తించి దిగ్గున మంచందిగి తలుపు తెరిచింది సరళ.

తూలుతూ లోపలికి ప్రవేశించిన ప్రకాశం, చేతిలోని సంచిని మూలకు విసిరి మంచంమీద వాలిపోయాడు— ఆయాసంతో రొప్పుతూ.

తలుపులు మూసి మంచం పట్టెమీద కూర్చొని అతనివేపు విచిత్రంగా చూసింది సరళ. అతని నోటిగుండా మాటలు పెగల్లేదు. అతని పరిస్థితి చాలాసేపటికి గ్రహించినావిడ అతనికి జ్వరం తగిలినట్లు మాత్రం గ్రహించింది.

ముఖం ఆమెకు చూపకుండా గోడకేసి తిప్పి పడుకున్నాడు ప్రకాశం. అతనిలో జ్వరం తీవ్రతకంటె ఎక్కువగా తన పని కాకపోవడమే భార్యముందు నామోషిగా వుంది.

అతనివేపు చూస్తున్నకొద్దీ ఆమె హృదయం జాలితో నిండుకుంది. మనస్సు హారతి కర్పూరంలా కరిగిపోయింది. అతని ప్రక్కనే శరీరాన్ని వాల్చి, అతని వీపుకు బల్లిలా కరుచుకపోయింది. పశ్చాత్తాపంతో కారుతున్న నీటి బిందువులు అతని వీపును తడిపేయ సాగాయి.

ఎదురుగా రెప రెప లాడుతూ వెలుగుతోంది దీపం.

